సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 22 । మే । 2025



దంచి కొట్టిన వర్షం

జిల్లాలో బుధవారం కుండపోతగా కురిసింది. ప్రధానంగా నగరంలోని అండర్ బ్రిడ్జిల్లో భారీగా నీరు చేరింది. రహదారుల్లో వర్షపు నీటితో డ్రైనేజ్ పొంగింది.

8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.98,930
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,930
3 శాతం జీఎస్టీతో	రూ.9,198
నవర (8 గ్రా)	రూ.73,584

గరిష్టం/కనిష్టం
35.8 /27.3

వాతావరణం

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతంగా ఉండి, అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. బుధవారం గాలిలో తేమ 31 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

పది పరీక్షలకు 380 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు బుధవారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 380 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంగ్లిష్ పరీక్షకు 966 మంది హాజరు కావాల్సి ఉండగా 586 మంది హాజరయ్యారు.

సింహవాహనంపై కామాక్షితాయి



బుచ్చిరెడ్డిపాళెంరూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవారు సింహ వాహనంపై విహరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

24న ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా

నెల్లూరు (పొగతోట): ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 24న నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్‌ఖయ్యూమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీ యాజమాన్యాలు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9494456326 నంబరులో సంప్రదించాలని కోరారు.

డీసీపల్లిలో 228 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం 228 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలానికి 306 బేళ్లు రాగా 228 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 28189.4 కిలోల పొగాకును విక్రయించగా రూ.6959592.10 వ్యాపారం జరిగింది. కిలోకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.200, సగటు ధర రూ.246.89 లభించింది. వేలంలో 10 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్



మాట్లాడుతున్న పీడీ నాగరాజకుమారి

నెల్లూరు (పొగతోట): జిల్లాలో స్వయం సహాయక గ్రూపు మహిళలు చిన్న చిన్న పరిశ్రమల ద్వారా ఉత్పత్తి చేస్తున్న ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు. బుధవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో మహిళా సంఘాలకు ఉత్పత్తులు, మార్కెట్, ప్యాకింగ్ తదితర అంశాలపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పీడీ మాట్లాడారు. వినియోగదారులు ఆకర్షితులయ్యేలా ప్యాకింగ్, లేబుల్‌ను డిజైన్ చేయాలని తెలిపారు. ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో వేగవంతంగా ముందుకు దూసుకుపోయేలా చర్యలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీఆర్ఐ డైరెక్టర్ స్వర్ణ, అసిస్టెంట్ బాలు, డీపీఎం భానుప్రసాద్, నాగేంద్రప్రసాద్, ఎం.కిరణ్, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

వీఆర్వోలకు ఉద్యోగోన్నతులు కల్పించండి

నెల్లూరు(అర్బన్): గ్రేడ్ –1 వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ కల్పించేందుకు అవసరమైన సీనియారిటీ జాబితాను త్వరితగతిన తయారు చేయాలని వీఆర్వో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పంటా అశోక్‌కుమార్‌రెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు. పలువురు వీఆర్వోలతో కలిసి బుధవారం కలెక్టరేట్‌లో డీఆర్వో ఉదయభాస్కర్‌రావుకు వినతి పత్రం ఇచ్చారు. పంటా అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2019లో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో గ్రేడ్ –2 వీఆర్వోలుగా చేరిన వారికి కూడా గ్రేడ్–1 వీఆర్వోలుగా ప్రమోషన్లు కల్పించేందుకు సీనియారిటీ జాబితాను సిద్ధం చేయాలని కోరారు. వీఆర్వోలకు రేషనలైజేషన్‌పై ఉన్న సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి రమణయ్య, నాయకులు రవి, శేఖర్, కృష్ణారావు, పెంచలరావు, జనార్దన్, శరవణ్, మునిబాబు, జగదీష్, విష్ణు, అశోక్, అనిల్ పాల్గొన్నారు.

రేషన్ బండి.. ఇంటికి రాదండి

- ఇంటి వద్దే సరుకుల పంపిణీకి మంగళం
- జిల్లాలో 438 ఎండీయూ వాహనాలు
- వీటిని నమ్ముకున్న ఆపరేటర్లు, హెల్పర్లు వీధుల పాలు
- నిరుద్యోగులకు ఉపాధి కల్పన చేస్తామని పొట్ట కొట్టిన కూటమి ప్రభుత్వం

మాజీ సీఎం జగన్ మార్క్ పాలన చెరిపేస్తున్న కూటమి

ఇంటి వద్దే బియ్యం పంపిణీ చేసే వ్యవస్థకు కూటమి ప్రభుత్వం మంగళం పలికింది. దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న ఈ విధానం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్క్ పరిపాలనకు గీటురాయి. ఆ మార్క్ చెరిపేస్తూ జిల్లాలో లక్షలాది మంది ప్రజలను కన్నీటి కష్టాలకు గురి చేసేందుకు చంద్రబాబు సిద్ధపడ్డాడు. రేషన్ షాపుల వద్ద నుంచి సరుకులు తెచ్చుకోవడం లబ్ధిదారులకు దశాబ్దాల ప్రహసనంగా ఉండేది. వృద్ధులు, దివ్యాంగులు, పేదల రేషన్ కష్టాలు తీర్చేందుకు ఇంటి వద్దకే చేర్చాలనే గొప్ప సంకల్పానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎండీయూ వాహనాలతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించింది. అయితే కూటమి ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో లక్షలాది కుటుంబాలకు రేషన్ కష్టాలు మొదలయ్యాయి. ఎండీయూ వాహనాల ద్వారా జీవనోపాధి పొందుతున్న నిరుద్యోగులు రోడ్డున పడనున్నారు.

సీతారామపురం: ప్రజలిచ్చిన అధికారం అయితే కూటమి ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించేది. అందుకు భిన్నంగా అధికారంలోకి వచ్చిన కూటమి పాలకులు ప్రజల కష్టాలు, కన్నీళ్లు తెప్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ప్రశంసలు అందుకున్న పారదర్శకమైన మోడల్ కాన్సెప్ట్ ఇంటి వద్దకే రేషన్ సరుకుల పంపిణీ వ్యవస్థకు గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. అయితే మార్క్ పరిపాలన చెరిపేస్తూ, వీధివీధికి నాలుగేళ్లుగా విశిష్ట సేవలు అందించిన రేషన్ సరుకుల పంపిణీ బండ్లు ఆగిపోనున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు నిత్యావసరాలను డోర్ డెలివరీ చేయాలని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఎండీయూ వాహనాలకు కూటమి సర్కార్ మంగళం పాడింది. జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల్లోనే బియ్యం ఇతర నిత్యావసరాలను ఇవ్వాలని మంత్రుల సబ్ కమిటీ నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయంతో ఇకపై ప్రజలే రేషన్ షాపులను వెతుక్కుంటూ కిలో మీటర్ల దూరం వెళ్లక తప్పని పరిస్థితి నెలకొంది. రేషన్ కోసం షాపుల ముందు పడిగాపులు కాయాల్సిందే. ఇప్పటికే వలంటీర్లను తీసివేయడంతో పౌర సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్న ప్రజలు రేషన్ బండ్ల రద్దుతో మళ్లీ పాత విధానంలో రేషన్ షాపు డీలర్ల ముందు నిలబడక తప్పదు.

రోడ్డున పడనున్న ఆపరేటర్లు, హెల్పర్లు

జిల్లాలో 438 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. ప్రతి వాహనానికి ఒక ఆపరేటర్, ఒక హెల్పర్ ఉంటారు. వీరికి వాహనం నడిపేందుకు అవసరమైన ఖర్చుల కోసం ప్రతి నెలా ప్రభుత్వం రూ.21,000 చెల్లిస్తోంది. ఇందులో రూ.3 వేలు వాహనం కంతు. మరో రూ.3 వేలు వాహనం ఇంధనం, మరో రూ.5 వేలు హెల్పర్‌కు ఇస్తారు. మిగిలిన రూ.10 వేలు ఆపరేటర్ వేతనంగా జమ చేసుకుంటారు. ఈ క్రమంలో ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో ఆపరేటర్లు, హెల్పర్లు రోడ్డున పడాల్సి వస్తోంది. తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలిస్తామని ప్రచారం చేసిన కూటమి పాలకులు ఇప్పుడు గత ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి, ప్రజలకు సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ, తాజాగా ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి వారిని నిరుద్యోగులుగా మార్చేసింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వారి భవిష్యత్ అగమ్యగోచరమైంది. వాస్తవంగా ప్రభుత్వంతో చేసుకున్న అగ్రిమెంట్ గడువు 2027 జనవరి వరకు ఉంది. కానీ ఉన్న ఫలంగా వాహనాలను ఆపేయడంతో వారి పరిస్థితి దయనీయంగా మారనుందని వారంతా ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో ఎండీయూ వాహనాలు
438

రేషన్ షాపులు
1,513

రేషన్ కార్డులు
7,22,257

60 ఏళ్లు దాటిన వృద్ధులు
1,70,108 మంది

దివ్యాంగులు
33,148 మంది

వితంతు మహిళలు
74,265 మంది

ఒంటరి మహిళలు
11,102 మంది





ఎండీయూ వాహనం ద్వారా సరుకులు తీసుకుంటున్న ప్రజలు (ఫైల్)

భారమంటూ దుష్ప్రచారం

జిల్లాలోని 37 మండలాల్లో 1,513 రేషన్ దుకాణాలు ఉండగా 7,22,257 రేషన్ కార్డులున్నాయి. వాటిలో పేద, మధ్య తరగతుల లబ్ధిదారులే అధికంగా ఉన్నారు. 2021 ఏప్రిల్ 1వ తేదీకి ముందు వరకు రేషన్ షాపుల ద్వారా ప్రజలు సరుకులు పొందేవారు. అయితే కొన్ని గ్రామాల్లో షాపులు లేకపోవడం, పట్టణాల్లో కిలో మీటర్ల దూరంలో రేషన్ షాపులు ఉండడంతో సరుకుల కోసం లబ్ధిదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. కొన్ని చోట్ల గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి. డీలర్లు ఎప్పుడు వస్తే అప్పుడు సరుకులు తీసుకోవాల్సి ఉండేది. ఈ క్రమంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల ఇళ్లకు డెలివరీ ద్వారా నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలని నిర్ణయించి ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే సరుకులను అందించేలా చర్యలు చేపట్టారు. ప్రజలకు వ్యయ ప్రయాసలు తగ్గడంతోపాటు ఎంతో సౌకర్యంగా ఉండేది. అయితే గత ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తున్న కూటమి ప్రభుత్వం వాహనాలను భారమంటూ దుష్ప్రచారం చేస్తూ తాజాగా ఎండీయూ వాహనాలను అర్ధాంతంగా తొలగించింది. ఈ వ్యవస్థ అదనపు భారతమైతే ప్రజలకు సేవలందించే ప్రభుత్వ శాఖలు, ఉద్యోగులు, అధికారులు, ఆఖరికి పాలకులు సైతం రాష్ట్ర ఖజానాకు భారమే కదా? వాటిని ఎందుకు నిర్వహించేది.. అన్ని రద్దు చేసేస్తే సరిపోతుంది కదా? అని ప్రజలు నిగ్గదీస్తున్నారు.

జీవనోపాధి కోల్పోతాం



నేను నాలుగేళ్ల నుంచి ఎండీయూ వాహనాన్ని నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ప్రజలకు ప్రతి నెల 16వ తేదీ వరకు బియ్యం, ఇతర సరుకులను ఇళ్ల వద్దకే వెళ్లి ఇస్తున్నాం. బండి ద్వారా నాకు, నా హెల్పర్‌కు జీవనోపాధి లభిస్తోంది.

– అనిల్ రాజు, ఎండీయూ ఆపరేటర్, సీతారామపురం బిట్–2

ప్రభుత్వం ఉపాధి చూపించాలి



ఎండీయూ వ్యవస్థను తీసుకొచ్చినప్పుడే మాకు 72 నెలలకు అగ్రిమెంట్ చేశారు. ఇన్నేళ్లుగా మా సేవలను వినియోగించుకుని ఇప్పుడేదో ఉచితంగా వాహనం ఇచ్చేస్తున్నట్లు మాట్లాడడం సరికాదు. ముందు బ్యాంకుల నుంచి ఎన్‌ఓసి ఇప్పించి జీవనోపాధి చూపించాలి.

– పెంచలప్రసాద్, ఎండీయూ ఆపరేటర్, చిన్ననాగంపల్లి

ప్రభుత్వ నిర్ణయం సరికాదు



ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి మా జీవితాలను రోడ్డున పడేలా తీసుకున్న ప్రభుత్వం నిర్ణయం సరికాదు. మా జీవితాలను రాజకీయాలతో ముడి పెట్టడం సరికాదు. ఎండీయూ వాహనం ద్వారా వస్తున్న ఆదాయంతో జీవనాన్ని కొనసాగిస్తున్నాం.

– సునీల్, ఎండీయూ ఆపరేటర్, గంగవరం

మైనింగ్, బెట్టింగ్‌లపై విచారణ జరిపించే దమ్ముందా

- మాజీ మంత్రి అనిల్‌కుమార్ నిష్కళంక నాయకుడు
- రూప్‌కుమార్.. వీపీఆర్ డూప్
- బెట్టింగ్ గాళ్లు.. కేటుగాళ్లతో మాట్లాడిస్తున్నారు
- రాష్ట్ర సంగీత అకాడమీ మాజీ చైర్‌పర్సన్ పొట్టేళ్ల శిరిషా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పొట్టేళ్ల శిరీషా

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో అక్రమ మైనింగ్, క్రికెట్ బెట్టింగ్‌పై అత్యున్నత స్థాయి దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించే దమ్ము.. ఈ కూటమి నాయకులకు ఉందా? అని జెడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్, రాష్ట్ర సంగీత అకాడమీ మాజీ చైర్‌పర్సన్ పొట్టేళ్ల శిరిషా సవాల్ విసిరారు. నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అబద్ధాలను.. నిజాలుగా చెప్పే టాలెంట్ ఉన్న రూప్‌కుమార్ వీపీఆర్ డూప్ అని విమర్శించారు. సైదాపురంలో అక్రమ మైనింగ్‌పై ఆధారాలతో మా నాయకుడు, మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ బహిర్గతం చేస్తే.. ఏ ఒక్క దానికైనా మైనింగ్ డాన్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమాధానం ఇచ్చారా? అని ప్రశ్నించారు. నిజాలపై మాట్లాడే దమ్ము, చావ లేక.. చిల్లరగాళ్లు, బెట్టింగ్ గాళ్లు, కేటుగాళ్ల చేత మాట్లాడిస్తున్నారని విమర్శించారు. అక్రమ మైనింగ్‌లో ఈ బెట్టింగ్ రాయుడు రూప్‌కుమార్‌కు సంబంధం ఉంది కాబట్టే ఆయన డాన్ వీపీఆర్‌కు వంత పాడుతున్నారని దుయ్యబట్టారు. వీపీఆర్ బాధ్యత గల ఎంపీ స్థానంలో ఉన్నారని, ఆయనే సమాధానం చెప్పాలన్నారు. అయితే ఈ బెట్టింగ్ రాయుడి ఆరాటం ఏమిటో తెలియడం లేదన్నారు. రూ.వేల కోట్లు దోచుకుని రూ.లక్ష దానం చేస్తే దైవాంశ సంభూతులుగా మారిపోతారా? అని ప్రశ్నించారు. వేల కుటుంబాలు రోడ్డున పడుతున్నారని మాట్లాడితే సమాధానం చెప్పలేక నిష్కళంక నాయకుడు అనిల్‌కుమార్‌పై విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. క్రికెట్ బెట్టింగ్ విషయంలో సీఐ దుర్గాప్రసాద్ పట్టుకుని కొడితే అనిల్‌పై నింద వేశావన్నారు. బెట్టింగ్‌పై విచారణ జరిపిస్తే వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. పశువుల సంతకు రూ.కోటి లంచం తీసుకున్నారని మరో నింద వేశావు. గట్టిగా అరిస్తే అబద్ధాలు నిజమవుతాయా అని నిలదీశారు. కోవిడ్ సమయంలో ఆస్పత్రి నుంచి డబ్బులు తీసుకున్నారని ఆరోపణలను నిరూపించగలవా అని సవాల్ విసిరారు. కార్యకర్త బాలకృష్ణారెడ్డి అప్పుడు, ఇప్పుడు మీ ఇంటి చుట్టూనే తిరుగుతున్నాడని, అయినా అతని ఇంటిని కూలగొట్టించావు, పైగా అనిల్‌కుమార్ పరామర్శించలేదని మాట్లాడడానికి సిగ్గుపడాలన్నారు. అనిల్‌కుమార్ దయతో మూలాపేటలో ఇల్లు కట్టుకున్నావు. ఇప్పుడు తిన్నింటి వాసాలు లెక్క పెడుతూ వీపీఆర్ పంచన చేరావన్నారు. అనిల్‌కుమార్ నెల్లూరు వదిలి పోలేదని, జగనన్న ఆదేశిస్తే నరసరావుపేటకు వెళ్లారన్నారు. రక్తాలు చిందించి అనిల్‌ని గెలిపించానని మాట్లాడుతున్నారని, ఆయనది రాజకీయ కుటుంబం, మీరు ఆయన్ని ఎమ్మెల్యే చేయాల్సిన అవసరం లేదన్నారు. మొదటగా మైనింగ్ మీద విచారణ జరిపించాలని, తొలుత ఐదు మైన్లపై విచారణ జరగాలని, అన్ని అకౌంట్లు మీ మీదే ఉన్నాయన్నారు. ఇవన్నీ విచారణ చేస్తే మొట్టమొదటగా ఇరుక్కునే రూప్‌కుమారే అని అన్నారు. ప్రభుత్వం మీదే అయినప్పుడు విచారణకు అంగీకరించాలని, బెట్టింగ్‌పైనా విచారణ జరపాలన్నారు.

కూటమి అరాచకాలకు మూల్యం తప్పదు

- వైఎస్సార్‌సీపీ క్యాడర్‌కు అండగా లీగల్ సెల్
- తప్పు చేసే అధికారులు, పోలీసులూ జాగ్రత్త
- కోవూరు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెంచురెడ్డి, శ్యామాచార్యులు




మాట్లాడుతున్న శ్యామాచార్యులు, చిత్రంలో చెంచురెడ్డి, న్యాయవాదులు

కోవూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు స్వస్తి పలకకపోతే, భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని కోవూరు నియోజకవర్గం లీగల్ సెల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెంచురెడ్డి, జి. శ్యామాచార్యులు హెచ్చరించారు. అధికార పార్టీ నేతలు చెప్పారని అడ్డంగా పనిచేసే అధికారులు, పోలీసులూ శిక్ష అనుభవించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో లీగల్ సెల్ కమిటీ బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించింది. వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో పాలనపై ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉందన్నారు. ప్రశ్నించే వారిపైనా, అమాయకులపైనా అక్రమ కేసులు బనాయించే కొత్త సంస్కృతికి కూటమి ప్రభుత్వం తెరతీసిందన్నారు. వైఎస్సార్‌సీపీ క్యాడర్‌ను భయపెట్టాలని చూస్తే ఎవరూ భయపడేవారు లేరన్నారు. అభిమానులు, కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు బనాయించినా, దాడులకు పాల్పడినా, ఆస్తులు ధ్వంసం చేసినా ఇకపై చూస్తూ వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఊరుకోదని హెచ్చరించారు. పార్టీ కేడర్‌కు లీగల్ అండగా నిలబడి, కేసులను ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ఇక నుంచి లీగల్ సెల్ టీమ్ క్రియాశీలకంగా పనిచేస్తుందని, ప్రతి శనివారం పార్టీ కార్యాలయంలో లీగల్ టీమ్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. అధికారులు కూడా వారి విధులు వారు చేసుకోవాలే తప్ప పచ్చ కండువాలు కప్పుకుంటే రాబోయే రోజుల్లో కష్టాలు పడాల్సి వస్తుందన్నారు. కొందరు అమాయకులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి వాంగ్మూలం తీసుకుని సంబంధం లేని వారిని అక్రమ కేసుల్లో ఇరికిస్తున్న పోలీసులకు చట్టపరంగా శిక్ష తప్పదన్నారు. ఇప్పటికే కొందరు నిజాయితీ, నిక్కచ్చి కలిగిన అధికారులు పక్కకు తప్పుకుంటున్నారని చెప్పారు.

ఏడాది పాలన దగా

ఏడాది కూటమి పాలనలో అడుగడుగునా దగా, దౌర్జన్యాలు, ప్రకృతి సంపద దోపిడీలు, అక్రమాలు, అవినీతి పెరిగాయన్నారు. ప్రతి వ్యవస్థను సర్వనాశనం చేసిందన్నారు. విచ్చలవిడి మద్యం అమ్మకాలతో నేర ప్రవృత్తి పెరిగిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మద్యం మత్తులో హత్యలు, మహిళలపై అత్యాచారాలు, దళితులపై దాడులు మితిమీరాయన్నారు. ప్రజలు ప్రతిక్షణంలో అభద్రతలో జీవిస్తున్నారన్నారు. గతంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలు, ఆడపిల్లల భద్రత కోసం దిశ యాప్ తెస్తే దాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అత్తిపల్లి అనూప్ కుమార్‌రెడ్డి, న్యాయవాదులు మల్లికార్జున, బాలకృష్ణ, శ్రీనివాసులురెడ్డి, చందు, రాజేష్, నాయకులు సుధాకర్‌రెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.

క్రస్ట్‌గేట్ల నుంచి డెల్టాకు నీరు నిలిపివేత



- ఉత్తరకాలువకు 100 క్యూసెక్కుల నీరు పెంపు

సోమశిల: సోమశిల జలాశయం నుంచి డెల్టాకు తాగు, సాగుని ఇటీవల 6వ క్రస్ట్ గేట్ ద్వారా విడుదల చేసిన విషయం తెలిసిందే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దిగువ డెల్టా ప్రాంతాల వారికి సరిపడా నీరు చేరి ఒత్తిడి తగ్గడంతో అదనంగా క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదల చేసిన నీటిని బుధవారం నిలిపివేశారు. పవర్ టన్నెల్ ద్వారా డెల్టాకు నీరు విడుదలవుతున్నాయి. ఇదే సమయంలో ఉత్తర కాలువ కింద రైతాంగం అవసరాలకు 100 క్యూసెక్కుల నీటిని అదనంగా విడుదల చేశామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 45.375 టీఎంసీల నీరు నిల్వ ఉందని, పైతట్టు ప్రాంతాల నుంచి 150 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతుందన్నారు. పెన్నా డెల్టాకు పవర్ టన్నెల్ ద్వారా 3200 క్యూసెక్కులు, 17, 18 రివర్స్ స్లూయిజ్ ద్వారా లీకేజీ 30 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 200, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల వంతున దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం గేట్ ద్వారా నీరు నిలిపివేయడంతో ఆప్రాన్ మీదుగా వాహనాలను అనుమతిస్తున్నట్లు జలాశయ ఈఈ శ్రీనివాసులు తెలిపారు.

విధులకు రావద్దంటూ టీడీపీ నేతల బెదిరింపులు



విలేకరుల ఎదుట వాపోతున్న ఆదినారాయణ కుటుంబ సభ్యులు

- గ్రీన్ అంబాసిడర్ ఆవేదన

కొండాపురం: తాను గ్రీన్ అంబాసిడర్‌గా పని చేస్తుంటే.. ఇక నుంచి విధులకు రావద్దంటూ కొందరు టీడీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శి కొండమ్మ బెదిరిస్తున్నట్లు మండలంలోని పార్లపల్లి గ్రామానికి చెందిన చిట్టేటి ఆదినారాయణ వాపోయాడు. బుధవారం ఆయన పార్లపల్లిలో తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను ఐదేళ్లుగా గ్రీన్ అంబాసిడర్‌గా పని చేస్తున్నట్లు తెలిపాడు. ఇటీవల ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గ్రామానికి వచ్చిన సమయంలో కొందరు టీడీపీ నాయకులు తమను వైఎస్సార్‌సీపీ వాళ్లమని, విధులకు రావద్దని బెదిరించారన్నారు. పోలీసులతో సచివాలయ ప్రాంగణం నుంచి బయటకు నెట్టివేయించారన్నారు. రెండేళ్లుగా జీతం రాకపోయినా చెత్త సేకరించే పనిచేస్తున్నాని, తనకు రావాల్సిన జీతం ఇచ్చిన తరువాత తీసివేయండని అడగ్గా, ఎమ్మెల్యే జోక్యం చేసుకుని ఇక్కడి నుంచి వెళ్లిపోరా.. అంటూ అగౌరవంగా కించపరుస్తూ మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి కూడా పనికి రావద్దని, మీకు దిక్కున్న చోట చెప్పుకోమని చెప్పారన్నారు. అట్రాసిటీ కేసు పెట్టినా తీసుకునే వాళ్లు లేరని హేళన చేశారన్నారు. ఎమ్మెల్యే కలిగిరి సీఐ, కొండాపురం పోలీసులకు ఫోన్ చేసి చెప్పడంతో మరుసటి రోజు తమ గ్రామానికి చెందిన సుమారు 30 మంది టీడీపీ నాయకులు తమ కుటుంబ సభ్యులు ఏడుగురిపై తప్పుడు కేసులు పెట్టించారని వాపోయారు. తమను బెదిరించిన వారిపై కేసు ఇచ్చేందుకు పోలీసుస్టేషన్‌కు వెళ్లగా ఫిర్యాదు తీసుకోమని హెడ్‌కానిస్టేబుల్ రమేష్ చెప్పారన్నారు.

దంచికొట్టిన వర్షం


రైల్వేస్టేషన్లో ప్రయాణికుల అగచాట్లు


చెరువును తలపిస్తున్న గాంధీబొమ్మ సెంటర్

నెల్లూరు(అర్బన్): భానుడి భగభగలతో అల్లాడుతున్న ప్రజలను వరుణుడు పలకరించారు. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం నుంచి వర్షం కురిసింది. దాదాపు 30 నిమిషాల పాటు వర్షం దంచికొట్టడంతో జనజీవనం స్తంభించింది. నగరంలోని గాంధీబొమ్మ, ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి, ఏసీ స్టేడియం, మనుమసిద్ధినగర్, మాగుంట లేఅవుట్ తదితర ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్డుపై ప్రవహించింది. వెంకటాచలం, కోవూరు, ఇందుకూరుపేట, బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు, సంగం తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి.


సండే మార్కెట్ వద్ద ప్రవహిస్తున్న వర్షపునీరు


పట్టలతో రక్షణ పొందుతూ..

- సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


నీటమునిగిన ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని అండర్ బ్రిడ్జి


ట్రంక్‌రోడ్డులో ఇలా..

సర్టిఫికెట్లకూ నగదు ఇవ్వాల్సిందే..

- పారామెడికల్ కోర్సుల్లో నయా దోపిడీ
- రూ.ఐదు వేలు సమర్పిస్తేనే జారీ చేస్తామని హుకుం
- అన్ని ఫీజులు చెల్లించినా, కుదరదని స్పష్టీకరణ
- డీఎమ్మెల్టీల ఆందోళన



సుస్మిత నర్సింగ్ కళాశాల

నెల్లూరు(అర్బన్): టెక్నికల్ కోర్సుల్లో చేరి.. వాటిని పూర్తి చేస్తే త్వరగా ఉపాధి పొంది స్వశక్తితో ఎదగొచ్చని ఎంతో మంది భావిస్తుంటారు. ఈ తరుణంలో డీఎమ్మెల్టీ లాంటి పారామెడికల్ కోర్సుల్లో చేరి.. ఆపై రక్త పరీక్షల ల్యాబ్ పెట్టాలని కలలుగంటారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అన్ని ఫీజులను కళాశాలలకు చెల్లించి పాసయ్యారు. తీరా సర్టిఫికెట్ల కోసం వెళ్తే అదనంగా మరో రూ.ఐదు వేలను సమర్పిస్తేనే ఇస్తామని బెదిరిస్తుండటంతో ఏమి చేయాలో పాలుపోక వీరు నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. తాజాగా కావలిలోని ఎస్వీ పారామెడికల్ కళాశాలలో ఈ వ్యవహారం చోటుచేసుకుంది. తాము ఎందుకివ్వాలని పలువురు ఎదురుతిరగడంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది.

ఇదీ తంతు..

2021 – 22లో పలువురు అభ్యర్థులు రెండేళ్ల పాటు డీఎమ్మెల్టీ కోర్సులో చేరేందుకు నెల్లూరులోని సుస్మిత నర్సింగ్ కళాశాల యాజమాన్యాన్ని సంప్రదించారు. అయితే ఆ సమయంలో సదరు కళాశాలకు అఫిలియేషన్ లేదు. సాంకేతిక సమస్య ఉందని, డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో నిర్వహించే కౌన్సెలింగ్‌లో కావలిలోని ఎస్వీ పారామెడికల్ కళాశాలను కోరుకోవాలని వారు సూచించారు. ఆ తర్వాత నెల్లూరులోని తమ కళాశాలకు మారుస్తామని సదరు కళాశాల అధినేత తెలిపారు. అయితే అలా జరగలేదు. తదనంతరం ఈ రెండు కళాశాలలూ భాగస్వామ్యమయ్యాయి. ఈ క్రమంలో సుస్మిత నర్సింగ్ కళాశాల అధినేతకు అన్ని రకాల ఫీజులను పలువురు అభ్యర్థులు చెల్లించారు. వీటిని ఎస్వీ పారామెడికల్ కళాశాలకు జమ చేశారు. నెల్లూరు దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల కేంద్రంగా పరీక్షలను 2024లో నిర్వహించారు. కొంత మంది ఉత్తీర్ణులు కాగా, మరికొందరు ఫెయిలయ్యారు. సెప్టెంబర్‌లో సప్లిమెంటరీ రాసి ఉత్తీర్ణత సాధించారు.

డబ్బులిస్తేనే..

ఈ క్రమంలో పాస్ సర్టిఫికెట్లను ఇవ్వాలంటూ కావలిలోని ఎస్వీ పారామెడికల్ కళాశాల అధినేత దశరథరామయ్యను పలువురు అభ్యర్థులు కోరారు. రూ.ఐదు వేలను చెల్లిస్తేనే సర్టిఫికెట్లను ఇస్తామని, లేకపోతే కుదరదని తేల్చిచెప్పారు. స్టడీ సర్టిఫికెట్‌పై డాక్టర్ సంతకం చేయాలంటే ఆయనకూ లంచమివ్వాలని చెప్పారు. తాము పేదలమని, రూ.మూడు వేల వరకు ఇస్తామని ఫోన్లో ప్రాధేయపడినా ఆయన కనికరించలేదు. ఈ సంభాషణను అభ్యర్థులు తమ ఫోన్లలో రికార్డు చేశారు.

వాగ్వాదం

ఈ నేపథ్యంలో సుస్మిత నర్సింగ్ కళాశాల యాజమాన్యాన్ని నెల్లూరుకు చెందిన పలువురు అభ్యర్థులు నిలదీశారు. కళాశాలకు బుధవారం వెళ్లగా, అధినేత లేకపోవడంతో ఫోన్లో మాట్లాడారు. ఫీజులను మీకే చెల్లించాం, సర్టిఫికెట్లను ఇప్పించాలంటూ వాదనకు దిగారు. తానేమీ చేయలేనని, ఎస్వీ పారామెడికల్ కళాశాల యాజమాన్యాన్నే సంప్రదించాలంటూ తప్పించుకునే ధోరణిని ఆయన అవలంబించారు.

అన్ని కళాశాలల్లోనూ ఇదే తీరు..

జిల్లాలో 23 నర్సింగ్ కళాశాలలుండగా, ఇందులో తొమ్మిదింట్లో పారామెడికల్ కోర్సులను నిర్వహిస్తున్నారు. ఏటా ఒక్కో బ్యాచ్ చదువులు పూర్తి చేసుకొని బయటకొస్తుంది. అన్ని కళాశాలల్లో సైతం ఇదే తరహాలో సర్టిఫికెట్ల కోసం డబ్బులు వసూలు చేస్తున్నారని సమాచారం.

యూజీసీకి ఫిర్యాదు

సర్టిఫికెట్ల జారీ అంశంలో చోటుచేసుకున్న వ్యవహారంలో ఎస్వీ కళాశాల యాజమాన్యంపై ఫిర్యాదు చేస్తూ యూజీసీకి నగరానికి చెందిన పారామెడికల్ విద్యార్థిని మెయిల్ పంపారు. 20 రోజుల్లో విచారణ జరుపుతామనే సందేశం వచ్చింది. కాగా ఈ విషయమై సుస్మిత నర్సింగ్ కళాశాల అధినేతను ఫోన్లో సంప్రదించగా, ఈ విషయంలో తమకు సంబంధం లేదనే రీతిలో వ్యవహరించారు. ఇష్టపూర్వకంగానే ఎస్వీ కళాశాలను కౌన్సెలింగ్‌లో కోరుకున్నారని, వారేమీ చిన్నపిల్లలు కాదు కదా అన్నారు. ఫీజులను తనకు చెల్లించారని, వీటిని ఎస్వీ కళాశాలకు పంపానని బదులిచ్చారు.

విచారణ జరుపుతా



పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తా. డబ్బులు వసూలు చేస్తున్న వారిపై చట్ట రీత్యా చర్యలు చేపడతాం. డీఎమ్మెల్టీ విద్యార్థులకు అండగా ఉంటాం.

– సుజాత, డీఎంహెచ్‌ఓ

ఓర్వలేక కక్షసాధింపు చర్యలు

- మర్రిగుంట రేషన్ డీలర్ ఆవేదన


మాట్లాడుతున్న డీలర్ తదితరులు

కొండాపురం: తన ఇంట్లో రేషన్ దుకాణం ఉండటాన్ని ఓర్చుకోలేని కొందరు టీడీపీ నేతలు తన కుటుంబంపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని కొండాపురం మండలంలోని మర్రిగుంట గ్రామ డీలర్ సురేష్, సర్పంచ్ గోపీ ఆరోపించారు. మండలంలోని మర్రిగుంటలో విలేకరుల సమావేశంలో బుధవారం వారు మాట్లాడారు. మర్రిగుంట మీదుగా వెళ్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని స్థానిక సీతారాముల ఆలయం వద్ద గ్రామస్తులు శనివారం అర్ధరాత్రి అడ్డుకున్నారని చెప్పారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారొచ్చి వాహనాన్ని స్టేషన్‌కు తరలించారని, అయితే రాజకీయ నేతలు ఒత్తిడి తెచ్చి ఎలాంటి సంబంధంలేని తనపై కలిగిరి ఎస్సైతో కేసు నమోదు చేయించారని సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారుల పంచనామా, రిపోర్ట్ పోలీసులకు ఇవ్వకుండా తనపై ఎలాంటి నేర నిరూపణ లేకుండానే కేసు నమోదు చేశారని వాపోయారు. మండలంలోని టీడీపీ నేతలు వెనుక నుంచి ఇలా చేస్తున్నారని ఆరోపించారు. గతంలోనూ తన రేషన్ దుకాణంపై అధికారులు పలుమార్లు దాడులు నిర్వహించినా, ఎలాంటి లోటుపాట్లను కనుగొనలేదని చెప్పారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు తమపై లేనిపోనివి గ్రామానికి చెందిన కొందరు చెప్పి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని గోపీ ఆవేదన వ్యక్తం చేశాడు. దళిత కుటుంబం రాజకీయంగా ఎదగడం ఇష్టంలేని వారు అనేక కుట్రలు పన్నుతున్నారని చెప్పారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు.

25న బాలికల జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక


నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఈనెల 25న జిల్లా అండర్–19, 15 బాలికల క్రికెట్ జట్ల ఎంపికలు జరగనున్నాయని నెల్లూరు డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని క్రికెట్ క్రీడాప్రాంగణంలో ఎంపికలు ఆదివారం ఉదయం 9 గంటలకు జరుగుతాయన్నారు. బాలికలు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, డ్రస్‌కోడ్, తమ సొంత క్రికెట్ కిట్‌తో హాజరుకావాలని కోరారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	:	రూ.136
లేయర్ (లైవ్)	:	రూ.110
బ్రాయిలర్ చికెన్	:	రూ.244
స్కిన్‌లెస్ చికెన్	:	రూ.270
లేయర్ చికెన్	:	రూ.187

పొదలకూరు నిమ్మ ధరలు

పెద్దవి : రూ.80
సన్నవి : రూ.45
పండ్లు : రూ.25



పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



మనుబోలు: కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. విజయవాడ నుంచి ఓ కుటుంబం కారులో చెన్నై బయల్దేరారు. కాగితాలపూరు క్రాస్ దాటాక డ్రైవర్ ఏమరుపాటుగా ఉండటంతో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లో ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఘటనలో శిరీష గాయపడ్డారు. ఆమెను 108లో నెల్లూరు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో నీటి నిల్వ

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 42.71 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగకు 2250, పిన్నేరుకు 20, లోలెవల్‌కు 60, హైలెవల్‌కు 60, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. బుచ్చిరెడ్డిపాళెనికి చెందిన మున్వర్ పని నిమిత్తం బైక్‌పై కసుమూరు వచ్చారు. తిరిగెళ్తుండగా, కసుమూరు మలుపు రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పింది. గాయపడిన మున్వర్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు.

కొనసాగుతున్న సీహెచ్‌ఓల ఆందోళన



నెల్లూరు(అర్బన్): తమ సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మెను ఆపేదిలేదని సీహెచ్‌ఓల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భానుమహేష్ స్పష్టం చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ జిల్లాలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లను మూసేసి సీహెచ్‌ఓలు సమ్మె చేస్తున్నారు. నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట వారు చేపట్టిన నిరసన దీక్షలు బుధవారంతో 24వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరసన దీక్షలను తాము చేపట్టినా, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సంఘ జిల్లా కోఆర్డినేటర్ ఆదిల్, స్వాతి, అనూష తదితరులు పాల్గొన్నారు.

స్కెచ్చేసి.. ఆపై కంచె వేసి


కంచె వేసిన ప్రభుత్వ భూమి


- భూముల కబ్జాకు యత్నిస్తున్నా పట్టించుకోని అధికారులు
- హైవేను ఆనుకున్న నాలుగెకరాలపై కన్ను

మనుబోలు: అడ్డగోలుగా దోచుకునేందుకు అలవాటుపడిన కొందరు కేటుగాళ్లు ఎక్కడ ఖరీదైన భూములుంటే అక్కడ గద్దల్లా వాలిపోయి కబ్జాలకు తెరదీస్తున్నారు. తాజాగా వీరి కన్ను మనుబోలు మండలంలోని జాతీయ రహదారి పక్కనున్న ప్రభుత్వ భూములపై పడింది. మండలంలో పది కిలోమీటర్లకుపైగా జాతీయ రహదారి విస్తరించి ఉంది. హైవేకు ఇరువైపులా ఖరీదైన ప్రైవేట్, ప్రభుత్వ భూములున్నాయి. కాగితాలపూరు క్రాస్ వద్ద గల దాబా నుంచి ఉత్తరం వైపు హైవేకు.. రైల్వే లైన్‌కూ మధ్య సర్వే నంబర్లు 434 – 2, 3, 4, 5, 6, 7, 8, 9, 13, 434 – ఏలో సుమారు 33 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇదే విషయాన్ని రెవెన్యూ అధికారులు చెప్తుండగా, ఒక చోట సుమారు నాలుగెకరాల్లో కంచెను గుర్తుతెలియని వ్యక్తులు వేశారు. దీని విలువ సుమారు రూ.పది కోట్లకుపైగా ఉంటుంది. ఈ భూములను నుడాకు కేటాయిస్తున్నామని తహసీల్దారే చెప్పారు.

అధికార పార్టీ నేత అండతోనే..

నిత్యం రద్దీగా ఉండే హైవే పక్కన ఇంత దూరం కంచె వేస్తుంటే రెవెన్యూ అధికారులు ఎందుకు అభ్యంతరం తెలపలేదనే అంశం మిస్టరీగా మారింది. అధికార పార్టీ నేత అండతో రెవెన్యూ వారికి తెలిసే ఈ కంచె వేశారని స్థానికులు పేర్కొంటున్నారు. నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి ఖరీదైన భూములను కొట్టేసేందుకు పథకం పన్నారని, ఇందులో భాగంగానే కంచె వేశారని ఆరోపిస్తున్నారు. కాగా ఇందులో 434 – ఏ సర్వే నంబర్‌లోని 4.28 ఎకరాలు ఎర్రా పవిత్ర పేరుతో ఉంది. ఉన్నతాధికారులు స్పందించి కంచె వ్యవహారాన్ని నిగ్గుతేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

అదంతా ప్రభుత్వ భూమే



ఈ భూములన్నీ ప్రభుత్వానివే. సుమారు 33 ఎకరాలను నుడాకు అప్పగించేందుకు సిద్ధం చేశాం. ఈ భూముల మధ్యలో ఫెన్సింగ్ వేసిన విషయం వాస్తవమే. అయితే అది ఎవరేశారు.. ఎందుకేశారో తెలియదు.

– వెంకటసుబ్బయ్య, తహసీల్దార్